## "మురళి సారము"

10-11-25 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

### "మధురమైన పిల్లలూ - తనువు, మనసు, ధనముల ద్వారా మరియు మనసా-వాచా-కర్మణా ద్వారా ఏ విధముగా సేవ చేయండంటే, 21 జన్మల కొరకు తండ్రి నుండి ఫలితము లభించాలి, కానీ సేవలో ఎప్పుడూ పరస్పరములో మనస్పర్థలు ఉండకూడదు"

**ప్రశ్న:-** డ్రామానుసారముగా బాబా ఏదైతే సేవ చేయిస్తున్నారో, అందులో మరింత తీవ్రత తీసుకురావడానికి విధి ఏమిటి?

**జవాబు:-** పరస్పరములో ఏకమతముగా ఉండాలి, ఎప్పుడూ ఎటువంటి ఘర్షణ ఉండకూడదు. ఒకవేళ ఘర్షణ ఉన్నట్లయితే సేవ ఏమి చేయగలరు, అందుకే పరస్పరములో కలుసుకుని సంగఠనను తయారుచేసి సలహాలు చర్చించుకోండి, ఒకరికొకరు సహాయకులుగా అవ్వండి. బాబా అయితే సహాయకులుగా ఉండనే ఉన్నారు కానీ "పిల్లలు ధైర్యము చేస్తే తండ్రి సహాయము చేస్తారు...", దీని అర్థాన్ని యథార్థముగా అర్థం చేసుకుని పెద్ద కార్యములో సహాయకులుగా అవ్వండి.

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. పరస్పరములో చాలా-చాలా ప్రియముగా అవ్వాలి కానీ సోదరీ-సోదరులతో యోగము పెట్టుకోకూడదు. కర్మేంద్రియాలతో ఎటువంటి వికర్మలు చేయకూడదు.
2. ఒక్క ఈశ్వరీయ మతముపై నడుచుకుని సతోప్రధానముగా అవ్వాలి. మాయ మతమును విడిచిపెట్టాలి. పరస్పరములో సంగఠనను శక్తివంతముగా చేసుకోవాలి, ఒకరికొకరు సహాయకులుగా అవ్వాలి.

**వరదానము:- లక్ష్యము అనుసారముగా లక్షణాలను బ్యాలెన్స్ చేసే కళ ద్వారా ఎక్కే కళను అనుభవము చేసే బాబా సమాన సంపన్న భవ**

పిల్లల్లో విశ్వ కళ్యాణ కామన కూడా ఉంది, అలాగే బాబా సమానముగా అయ్యే శ్రేష్ఠమైన కోరిక కూడా ఉంది, కానీ లక్ష్యము అనుసారముగా ఏ లక్షణాలైతే స్వయానికి మరియు సర్వులకు కనిపిస్తాయో, వాటిలో తేడా ఉంది, అందుకే బ్యాలెన్స్ చేసే కళను ఇప్పుడు ఎక్కే కళలోకి తీసుకువచ్చి ఈ తేడాను తొలగించండి. సంకల్పము ఉంది కానీ దృఢతా సంపన్నమైన సంకల్పము ఉండాలి, అప్పుడు బాబా సమానముగా అయ్యే వరదానము ప్రాప్తిస్తుంది. ఇప్పుడు స్వదర్శనము మరియు పరదర్శనము, ఈ రెండు చక్రాలు తిరుగుతున్నాయి. వ్యర్థ విషయాలలో ఏదైతే త్రికాలదర్శులుగా అవుతారో, అది పరివర్తన చేసి స్వచింతకులుగా, స్వదర్శన చక్రధారులుగా అవ్వండి.

**స్లోగన్:-సేవా భాగ్యము ప్రాప్తించడమే అన్నింటికంటే గొప్ప భాగ్యము.**

### <u>అవ్యక్త ప్రేరణలు</u>

### అశరీరి మరియు విదేహీ స్థితి యొక్క అభ్యాసాన్ని పెంచండి

ఇలా అభ్యాసము చెయ్యండి - దేహము మరియు దేహము యొక్క దేశాన్ని మర్చిపోయి అశరీరి పరంధామ నివాసిగా అవ్వండి, ఆ తర్వాత పరంధామ నివాసి నుండి అవ్యక్త స్థితిలో స్థితులవ్వండి, ఆ తర్వాత సేవ కోసం శబ్దములోకి రండి, సేవ చేస్తూ కూడా మీ స్వరూపపు స్మృతిలో ఉండండి, మీ బుద్ధిని ఎక్కడ కావాలంటే అక్కడ ఒక్క క్షణము కంటే కూడా తక్కువ సమయములో ఏకాగ్రము చెయ్యండి, అప్పుడు పాస్ విత్ ఆనర్‌గా అవుతారు.

11-11-25 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - మీరు హృదయపూర్వకముగా బాబా-బాబా అని అన్నట్లయితే సంతోషములో రోమాలు నిక్కబొడుచుకుంటాయి, సంతోషముగా ఉన్నట్లయితే మాయాజీతులుగా అవుతారు"**

**ప్రశ్న:-** పిల్లలకు ఏ ఒక్క విషయములో శ్రమ అనిపిస్తుంది కానీ సంతోషానికి మరియు స్మృతికి అదే ఆధారము?

**జవాబు:-** ఆత్మాభిమానిగా అవ్వడములోనే శ్రమ అనిపిస్తుంది కానీ దీని ద్వారానే సంతోషపు పాదరసము పైకి ఎక్కుతుంది, మధురమైన బాబా గుర్తుకొస్తారు. మాయ మిమ్మల్ని దేహాభిమానములోకి తీసుకొస్తూ ఉంటుంది, రుస్తమ్‌తో రుస్తమ్ అయ్యి యుద్ధము చేస్తుంది, ఇందులో తికమకపడకూడదు. బాబా అంటారు - పిల్లలూ, మాయా తుఫానులకు భయపడకండి, కేవలం కర్మేంద్రియాలతో ఏ వికర్మలు చేయకండి.

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. మాయ తుఫానులకు భయపడకూడదు మరియు తికమకపడకూడదు. కేవలం కర్మేంద్రియాలతో ఏ వికర్మలు జరగకుండా అటెన్షన్ ఉంచాలి. జ్ఞానసాగరుడైన బాబా మమ్మల్ని చదివిస్తున్నారు - ఈ సంతోషములో ఉండాలి.
2. సతోప్రధానముగా అయ్యేందుకు ఆత్మాభిమానులుగా అయ్యే శ్రమ చేయాలి, జ్ఞానాన్ని విచార సాగర మంథనము చేయాలి, స్మృతియాత్రలో ఉండాలి.

**వరదానము:- శుభ చింతన ద్వారా జ్ఞాన సాగరునిలో ఇమిడిపోయే అతీంద్రియ సుఖము యొక్క అనుభవీ భవ**

ఏ విధముగా సాగరములో ఉండే జీవజంతువులు సాగరము లోపల ఉంటాయి, అంతేకానీ బయటకు రావాలని కోరుకోవు, చేప కూడా నీటి లోపల ఉంటుంది, సాగరము లేక నీరే దానికి ప్రపంచము, అదే విధముగా పిల్లలైన మీరు కూడా శుభ చింతన ద్వారా జ్ఞాన సాగరుడైన తండ్రిలో సదా ఇమిడిపోయి ఉండండి. ఎప్పటివరకైతే సాగరములో ఇమిడిపోయి ఉండటాన్ని అనుభవము చేయరో, అప్పటివరకు అతీంద్రియ సుఖమనే ఊయలలో ఊగుతున్నట్లుగా, సదా హర్షితముగా ఉంటున్నట్లుగా అనుభవము చేయలేకపోతారు. దీని కోసం స్వయాన్ని ఏకాంతవాసులుగా చేసుకోండి అనగా సర్వ ఆకర్షణల వైబ్రేషన్ల నుండి అంతర్ముఖులుగా అవ్వండి.

**స్లోగన్:- మీ ముఖాన్ని నడుస్తూ-తిరుగుతూ ఉన్న ఎటువంటి మ్యూజియమ్‌లా తయారుచేసుకోండి అంటే, అందులో బిందువైన బాబా కనిపించాలి.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**అశరీరి మరియు విదేహీ స్థితి యొక్క అభ్యాసాన్ని పెంచండి**

స్వయాన్ని శరీర బంధనము నుండి అతీతముగా చేసుకునేందుకు అవతారముగా భావించండి. నేను అవతారాన్ని, ఈ స్మృతిలో ఉంటూ శరీరాన్ని ఆధారముగా తీసుకుని కర్మలు చెయ్యండి. కానీ 'నేను చేస్తున్నాను' అన్న భానము నుండి అతీతమై కర్మలు చెయ్యండి. నేను చేసాను, నేను చేస్తాను... ఈ సంకల్పాన్ని కూడా సమర్పితము చెయ్యండి, అప్పుడిక కర్మ బంధనాలలో బంధింపబడరు. దేహములో ఉంటూ కూడా విదేహీ అవస్థను అనుభవము చేస్తారు.

12-11-25 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - మీకు డ్రామా ఆట గురించి తెలుసు, అందుకే కృతజ్ఞతలను తెలపవలసిన విషయము కూడా లేదు"**

**ప్రశ్న:-** సర్వీసబుల్ పిల్లల్లో ఏ అలవాటు అసలు ఉండకూడదు?

**జవాబు:-** యాచించే (అడిగే) అలవాటు. మీరు తండ్రిని ఆశీర్వాదాలు లేక కృప మొదలైనవి అడగవలసిన అవసరం లేదు. మీరు ఎవ్వరినీ ధనము కూడా అడగకూడదు. అడగడం కన్నా మరణించడం మేలు. మీకు తెలుసు, డ్రామా అనుసారముగా కల్పక్రితము ఎవరైతే బీజాన్ని నాటి ఉంటారో వారే నాటుతారు, ఎవరికైతే తమ భవిష్య పదవిని ఉన్నతముగా తయారుచేసుకునేది ఉంటుందో, వారు తప్పకుండా సహయోగిగా అవుతారు. మీ పని సేవ చేయడము. మీరు ఎవ్వరినీ ఏమీ అడగకూడదు. భక్తిలో అడగడం జరుగుతుంది, జ్ఞానములో కాదు.

**పాట:- నాకు ఆధారాన్ని ఇచ్చేవారు...**

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. వికర్మల నుండి రక్షించుకునేందుకు ఈ శరీరములో ఉంటూ అశరీరిగా అయ్యే పురుషార్థము చేయాలి. స్మృతియాత్ర ఏ విధముగా ఉండాలంటే, శరీర విస్మృతి జరగాలి.
2. జ్ఞాన మంథనము చేసి ఆస్తికులుగా అవ్వాలి. మురళీని ఎప్పుడూ మిస్ చేయకూడదు. మీ ఉన్నతి కోసము డైరీలో స్మృతి చార్ట్‌ను నోట్ చేయాలి.

**వరదానము:- ఆత్మిక శక్తిని ప్రతి కర్మలోనూ ఉపయోగించే యుక్తియుక్త, జీవన్ముక్త భవ**

ఈ బ్రాహ్మణ జీవితము యొక్క విశేషతయే ఆత్మికత. ఆత్మికత యొక్క శక్తితోనే స్వయాన్ని లేక సర్వులను పరివర్తన చేయగలరు. ఈ శక్తితో అనేక రకాల దైహిక బంధనాల నుండి విముక్తి లభిస్తుంది. కానీ యుక్తియుక్తులుగా అయి, ప్రతి కర్మలోనూ లూజ్ అయ్యేందుకు బదులుగా ఆత్మిక శక్తిని ఉపయోగించండి. మనసా, వాచా మరియు కర్మణా, మూడింటిలోనూ ఒకేసారి ఆత్మికతా శక్తిని అనుభవం చేయండి. ఎవరైతే మూడింటిలోనూ యుక్తియుక్తులో, వారే జీవన్ముక్తులు.

**స్లోగన్:- సత్యత యొక్క విశేషత ద్వారా సంతోషాన్ని మరియు శక్తిని అనుభూతి చేస్తూ వెళ్ళండి.**

## అవ్యక్త ప్రేరణలు

### అశరీరి మరియు విదేహీ స్థితి యొక్క అభ్యాసాన్ని పెంచండి

ఏయే పరిస్థితులైతే వస్తున్నాయో మరియు రాబోతున్నాయో, వాటి కోసం విదేహీ స్థితి యొక్క అభ్యాసము చాలా అవసరము, అందుకే మిగిలిన విషయాలన్నింటినీ పక్కన పెట్టి – ఇదైతే అవ్వదు, అదైతే అవ్వదు, ఏమవుతుందో... ఈ ప్రశ్నలను వదిలేయండి, ఇప్పుడు విదేహీ స్థితి యొక్క అభ్యాసాన్ని పెంచండి. విదేహీ పిల్లలపై ఎటువంటి పరిస్థితి గాని లేక ఎటువంటి అలజడి గాని ప్రభావాన్ని చూపలేదు.

13-11-25 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - మీరు దుఃఖాన్ని సహనము చేయడములో చాలా సమయాన్ని వ్యర్థము చేసారు, ఇప్పుడు ప్రపంచము మారుతోంది, మీరు తండ్రిని స్మృతి చేయండి, సతోప్రధానముగా అవ్వండి, అప్పుడు సమయము సఫలమవుతుంది"**

**ప్రశ్న:-** 21 జన్మల కొరకు లాటరీని ప్రాప్తి చేసుకునేందుకు పురుషార్థము ఏమిటి?

**జవాబు:-** 21 జన్మల కొరకు లాటరీని తీసుకోవాలంటే మోహజీతులుగా అవ్వండి. ఒక్క తండ్రిపై పూర్తిగా బలిహారమవ్వండి. ఇప్పుడు ఈ పాత ప్రపంచము పరివర్తనవుతుంది, మనము కొత్త ప్రపంచములోకి వెళ్తున్నాము అన్నది సదా స్మృతిలో ఉండాలి. ఈ పాత ప్రపంచాన్ని చూస్తూ కూడా చూడకూడదు. సుదాముని వలె పిడికెడు బియ్యాన్ని సఫలము చేసుకుని సత్యయుగీ రాజ్యాధికారాన్ని తీసుకోవాలి.

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. ఇప్పుడు ఈ శరీరము ద్వారా ఎటువంటి వికర్మలు చేయకూడదు. రిజిస్టర్ పాడయ్యే విధముగా ఎటువంటి ఆసురీ కర్మలు జరగకూడదు.
2. ఒక్క తండ్రి స్మృతి యొక్క నషాలో ఉండాలి. పావనముగా అయ్యే ముఖ్యమైన పురుషార్థాన్ని తప్పకుండా చేయాలి. గవ్వల వెనుక మీ అమూల్యమైన సమయాన్ని పాడు చేసుకోకుండా శ్రీమతము ద్వారా జీవితాన్ని శ్రేష్ఠముగా తయారుచేసుకోవాలి.

**వరదానము:- స్వయాన్ని విశ్వ సేవ కొరకు అర్పితము చేసుకుని మాయను దాసీగా చేసుకునే సహజ సంపన్న భవ**

ఇప్పుడు మీ సమయాన్ని, సర్వ ప్రాప్తులను, జ్ఞానాన్ని, గుణాలను మరియు శక్తులను విశ్వ సేవ కొరకు అర్పితము చెయ్యండి. ఏ సంకల్పము కలిగినా, చెక్ చేసుకోండి – అది విశ్వ సేవ కోసమే ఉందా. ఈ విధముగా సేవ కోసం అర్పణమవ్వడము ద్వారా స్వయం సహజముగా సంపన్నమవుతారు. సేవా లగనము ఉన్న చోట చిన్న-పెద్ద పేపర్లు లేక పరీక్షలు స్వతహాగానే సమర్పణ అయిపోతాయి. అప్పుడిక మాయకు భయపడరు. సదా విజయులుగా అయ్యే సంతోషములో నాట్యము చేస్తూ ఉంటారు, అటువంటివారు మాయను తమ దాసీగా అనుభవము చేస్తారు. స్వయం సేవలో సరెండర్ అయినట్లయితే మాయ స్వతహాగా సరెండర్ అయిపోతుంది.

**స్లోగన్:- అంతర్ముఖత ద్వారా నోటిని మూసి వేసినట్లయితే క్రోధము సమాప్తమైపోతుంది.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**అశరీరి మరియు విదేహీ స్థితి యొక్క అభ్యాసాన్ని పెంచండి**

ఏ విధముగా ఒక్క క్షణములో స్విచ్‌ను ఆన్ చెయ్యటము మరియు ఆఫ్ చెయ్యటము జరుగుతుందో, అదే విధముగా ఒక్క క్షణములో శరీరము యొక్క ఆధారాన్ని తీసుకోవాలి మరియు ఒక్క క్షణములో శరీరము నుండి అతీతమై అశరీరి స్థితిలో స్థితులైపోవాలి. ఇప్పుడిప్పుడే శరీరములోకి రావాలి, ఇప్పుడిప్పుడే అశరీరిగా అయిపోవాలి. అవసరమైనప్పుడు శరీరమనే వస్త్రాన్ని ధరించాలి, అవసరము లేనప్పుడు శరీరము నుండి వేరైపోవాలి. ఇది ప్రాక్టీస్ చెయ్యాలి, దీనినే కర్మాతీత అవస్థ అని అంటారు.

"మురళి సారము"

14-11-25 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - ఉన్నతోన్నతమైన పదవిని పొందాలంటే స్మృతియాత్రలో ఆనందముగా నిమగ్నమై ఉండండి - ఇదే ఆత్మిక ఉరికంబము, బుద్ధి తమ ఇంటికి వేలాడుతూ ఉండాలి"**

**ప్రశ్న:-** ఎవరి బుద్ధిలోనైతే జ్ఞాన ధారణ జరగదో, వారి గుర్తులేమిటి?

**జవాబు:-** వారు చిన్న-చిన్న విషయాలలో డిస్టర్బ్ అవుతూ, బాధపడుతూ ఉంటారు. ఎవరి బుద్ధిలో ఎంతగా జ్ఞాన ధారణ జరుగుతుందో, అంతగా వారికి సంతోషముంటుంది. ఇప్పుడిక ప్రపంచము కిందకు దిగజారవలసిందే, ఇందులో నష్టమే జరగనున్నది - ఈ జ్ఞానము ఒకవేళ బుద్ధిలో ఉన్నట్లయితే ఎప్పుడూ డిస్టర్బ్ అవ్వరు, బాధపడరు. సదా సంతోషము ఉంటుంది.

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. మీరు బుద్ధి ద్వారా అంతా మర్చిపోవాలి. ఏ విషయాలలోనైతే సమయము వ్యర్థము అవుతుందో, వాటిని వినవలసిన, వినిపించవలసిన అవసరము లేదు.
2. చదువుకునే సమయములో బుద్ధియోగము ఒక్క తండ్రితోనే జోడించబడి ఉండాలి, బుద్ధి ఎక్కడా భ్రమించకూడదు. నిరాకార తండ్రి మమ్మల్ని చదివిస్తున్నారు, ఈ నషాలో ఉండాలి.

**వరదానము:- తమ మహానతను మరియు మహిమను తెలుసుకుని సర్వాత్మలలో కల్లా శ్రేష్ఠమైనవారిగా, విశ్వము ద్వారా పూజ్యనీయులుగా కండి**

ప్రతి బ్రాహ్మణ బిడ్డ వర్తమాన సమయములో విశ్వములోని సర్వాత్మలలో కల్లా శ్రేష్ఠమైనవారు మరియు భవిష్యత్తులో విశ్వము ద్వారా పూజ్యనీయులు. నంబరువారుగా ఉన్నప్పటికీ చివరి నంబరులో ఉన్న మణిపూస కూడా విశ్వము ఎదురుగా మహానులే. ఈ రోజు వరకు భక్తాత్మలు చివరి నంబరు మణిపూసను కూడా కళ్ళకు అద్దుకుంటారు ఎందుకంటే పిల్లలందరూ బాప్‌దాదాకు కంటి తారలు, ప్రకాశ రత్నాలు. ఎవరైతే ఒక్కసారి అయినా మనసు ద్వారా, సత్యమైన హృదయము ద్వారా స్వయాన్ని బాబా బిడ్డగా నిశ్చయము ఏర్పరచుకుంటారో, బాబాకు డైరెక్ట్ బిడ్డగా అయ్యారో, వారికి మహానులుగా మరియు పూజ్యనీయులుగా అయ్యే లాటరీ మరియు వరదానము లభిస్తుంది.

**స్లోగన్:- స్థితి సదా ఖజానాలతో సంపన్నముగా మరియు సంతుష్టముగా ఉన్నట్లయితే పరిస్థితులు మారిపోతాయి.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**అశరీరి మరియు విదేహీ స్థితి యొక్క అభ్యాసాన్ని పెంచండి**

ఈ శరీరమనే ఇంటిని వదిలి, దేహాభిమాన స్థితిని వదిలి దేహీ-అభిమానులుగా అయిపోండి అని, ఈ ప్రపంచము నుండి దూరముగా ఉన్న మీ స్వీట్ హోమ్‌కు వెళ్ళండి అని బాప్‌దాదా అకస్మాత్తుగా డైరెక్షన్ ఇస్తే అలా వెళ్ళగలరా? యుద్ధ స్థలములో యుద్ధము చేస్తూ-చేస్తూ సమయాన్ని గడిపేయరు కదా! అశరీరిగా అవ్వటానికి ఒకవేళ యుద్ధములోనే సమయము గడిచిపోతే మరి అంతిమ పరీక్షలో ఎన్ని మార్కులు వస్తాయి మరియు ఏ డివిజన్ వస్తుంది!

"మురళి సారము"

15-11-25 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - మీ క్యారెక్టర్స్‌ను తీర్చిదిద్దుకునేందుకు స్మృతియాత్రలో ఉండాలి, తండ్రి స్మృతియే మిమ్మల్ని సదా సౌభాగ్యశాలులుగా చేస్తుంది"**

**ప్రశ్న:-** అవస్థ యొక్క పరిశీలన ఏ సమయములో జరుగుతుంది? మంచి అవస్థ అని దేనినంటారు?

**జవాబు:-** అవస్థ యొక్క పరిశీలన అనారోగ్యము సమయములో జరుగుతుంది. అనారోగ్యములో కూడా సంతోషము నిలిచి ఉండాలి మరియు సంతోషకరమైన ముఖముతో అందరికీ తండ్రి స్మృతిని ఇప్పిస్తూ ఉండండి, ఇదే మంచి అవస్థ. ఒకవేళ స్వయమే ఏడుస్తూ, ఉదాసీనముగా ఉన్నట్లయితే ఇతరులనెలా సంతోషపరచగలరు? ఏమి జరిగినా కానీ - ఏడవకూడదు.

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. మీ సమయాన్ని ఆత్మిక వ్యాపారములో సఫలము చేసుకోవాలి. వజ్రతుల్యమైన జీవితాన్ని తయారుచేసుకోవాలి. స్వయాన్ని సావధాన పరచుకుంటూ ఉండాలి. స్వయాన్ని శరీరముగా భావించే కఠినమైన రోగము నుండి రక్షించుకునే పురుషార్థము చేయాలి.
2. ఎప్పుడూ కూడా మాయకు దాసిగా అవ్వకూడదు. కూర్చుని నేను ఆత్మను అని లోలోపల జపము జపించాలి. మనము బికారుల నుండి రాకుమారులుగా అవుతున్నాము అన్న సంతోషముండాలి.

**వరదానము:- అనుభవాల గుహ్యత యొక్క ప్రయోగశాలలో ఉంటూ కొత్త రిసెర్చ్‌ను చేసే అంతర్ముఖీ భవ**

ఎప్పుడైతే మొదట స్వయములో సర్వ అనుభవాలు ప్రత్యక్షమవుతాయో, అప్పుడు ప్రత్యక్షత జరుగుతుంది - దీని కొరకు అంతర్ముఖులుగా అయ్యి స్మృతియాత్రలోకి మరియు ప్రతి ప్రాప్తి యొక్క లోతుల్లోకి వెళ్ళి రిసెర్చ్ చెయ్యండి. సంకల్పాన్ని ధారణ చెయ్యండి మరియు ఏ సంకల్పాన్ని అయితే ధారణ చేసారో, అది నెరవేరిందా లేదా అని దాని పరిణామాన్ని లేక సిద్ధిని చూడండి. అనుభవాల గుహ్యత యొక్క ప్రయోగశాలలో ఏ విధముగా నిమగ్నమై ఉండండి అంటే, వీరంతా ఏదో విశేషమైన లగనములో నిమగ్నమై ఈ ప్రపంచానికి అతీతముగా ఉన్నారు అన్నది అనుభవమవ్వాలి. కర్మలు చేస్తూ యోగము యొక్క శక్తిశాలి స్టేజ్‌లో ఉండే అభ్యాసాన్ని పెంచండి. ఏ విధముగా వాణిలోకి వచ్చే అభ్యాసముందో, అదే విధముగా ఆత్మికతలో ఉండే అభ్యాసాన్ని అలవరచుకోండి.

**స్లోగన్:- సంతుష్టత అనే సీట్‌పై కూర్చుని పరిస్థితులు అనే ఆటను చూసేవారే సంతుష్టమణులు.**

**అవ్యక్త ప్రేరణలు**

**అశరీరి మరియు విదేహీ స్థితి యొక్క అభ్యాసాన్ని పెంచండి**

ఏ విధముగా హఠయోగులు తమ శ్వాసను ఎంత సమయము కావాలంటే అంత సమయము ఆపగలరో, అదే విధముగా సహజయోగులు, స్వతహాయోగులు, సదాయోగులు, కర్మయోగులు, శ్రేష్ఠయోగులు అయిన మీరు మీ సంకల్పాలను, శ్వాసను ప్రాణేశ్వరుడైన బాబా యొక్క జ్ఞానము ఆధారముతో ఏ సంకల్పమో, ఎటువంటి సంకల్పమో, ఎంత సమయము చెయ్యాలనుకుంటే అంత సమయము ఆ సంకల్పములోనే స్థితులైపోండి. ఇప్పుడిప్పుడే శుద్ధ సంకల్పాలలో రమించండి, ఇప్పుడిప్పుడే ఒకే లగనములో అనగా బాబాతో మిలనము చేసుకోవాలి అన్న ఒక్క శుద్ధ సంకల్పములోనే, అశరీరిగా అవ్వాలన్న ఒక్క శుద్ధ సంకల్పములోనే స్థితులైపోండి.

"మురళి సారము"

16-11-25 ప్రాతః మురళి ఓంశాంతి "అవ్యక్తబాప్‌దాదా" రివైజ్-15-12-2007 మధువనం

**"సమయము యొక్క మహత్వాన్ని తెలుసుకుని, కర్మల గుహ్య గతి పట్ల అటెన్షన్ పెట్టండి, నష్టోమోహులుగా, ఎవర్రెడీగా అవ్వండి"**

- ❖ ఈ రోజు సర్వ ఖజానాల దాత, జ్ఞాన ఖజానాను, శక్తుల ఖజానాను, సర్వ గుణాల ఖజానాను, శ్రేష్ఠ సంకల్పాల ఖజానాను ఇచ్చే బాప్‌దాదా తమ నలువైపులా ఉన్న ఖజానాలకు బాలకులు మరియు యజమానులైన అధికారీ పిల్లలను చూస్తున్నారు. అఖండ ఖజానాలకు యజమాని అయిన బాబా పిల్లలందరినీ సర్వ ఖజానాలతో సంపన్నము చేస్తున్నారు.
- ❖ అన్నింటికన్నా అమూల్యమైన శ్రేష్ఠ ఖజానా - పురుషోత్తమ సంగమయుగము యొక్క సమయము. ఈ మహత్వాన్ని తెలుసుకుని ఎంతగా స్వయాన్ని శ్రేష్ఠముగా తయారు చేసుకోవాలంటే అంతగా తయారుచేసుకోవచ్చు.
- ❖ తీవ్ర పురుషార్థీ యొక్క లక్షణాలు విశేషముగా రెండు ఉంటాయి - ఒకటి - నష్టోమోహ, రెండు - ఎవర్రెడీ. అన్నింటికన్నా ముందుగా నష్టోమోహ, ఈ దేహభానము, దేహ అభిమానము నుండి నష్టోమోహులుగా అయినట్లయితే ఇతర విషయాలలో నష్టోమోహులుగా అవ్వడము ఏమీ కష్టము కాదు. అలాగే, ఎవర్రెడీ యొక్క అర్థము - మనసా, వాచా, కర్మణా, సంబంధ, సంపర్కాలలో సమయము అకస్మాత్తుగా ఆజ్ఞను ఇస్తే ఎవర్రెడీగా ఉండాలి.
- ❖ కర్మల గతి చాలా గుహ్యమైనది. ఏ విధముగా డ్రామా పట్ల అటెన్షన్ ఉంటుందో, ఆత్మిక స్వరూపము పట్ల అటెన్షన్ ఉంటుందో, ధారణల పట్ల అటెన్షన్ ఉంటుందో, అలాగే కర్మల గుహ్య గతి పట్ల కూడా అటెన్షన్ ఉంచడం అవసరము.
- ❖ విశ్వములోని ఆత్మలలో ఎవరైతే దుఃఖితులుగా, అశాంతిగా అవుతున్నారో, ఆ ఆత్మలను దుఃఖము, అశాంతి నుండి విడిపించడానికి మీ శక్తుల ద్వారా సకాష్‌ను ఇవ్వండి.

**వరదానము:- రియాల్టీ ద్వారా ప్రతి కర్మలోనూ మరియు మాటలోనూ రాయల్టీని చూపించే ఫస్ట్ డివిజన్ యొక్క అధికారీ భవ**

రియాల్టీ అనగా తమ అసలైన స్వరూపము యొక్క స్మృతి సదా ఉండటము. దీని ద్వారా స్థూలముగా ముఖములో కూడా రాయల్టీ కనిపిస్తుంది. రియాల్టీ అనగా ఒక్క బాబా తప్ప మరెవ్వరూ లేరు. ఈ స్మృతి ద్వారా ప్రతి కర్మలోనూ మరియు మాటలోనూ రాయల్టీ కనిపిస్తుంది. మీ సంపర్కములోకి ఎవరు వచ్చినా, వారికి ప్రతి కర్మలోనూ బాబా సమానమైన చరిత్ర అనుభవమవుతుంది, ప్రతి కర్మలోనూ బాబా సమానమైన అథారిటీ మరియు ప్రాప్తి అనుభూతి అవుతుంది. బాబా సాంగత్యము రియల్ (సత్యమైనది) అయిన కారణముగా అది పారసములా పని చేస్తుంది. ఇటువంటి రియాల్టీ కల రాయల్ ఆత్మలే ఫస్ట్ డివిజన్‌కు అధికారులుగా అవుతారు.

**స్లోగన్:- శ్రేష్ఠ కర్మల ఖాతాను పెంచుకున్నట్లయితే వికర్మల ఖాతా సమాప్తమైపోతుంది.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**అశరీరి మరియు విదేహీ స్థితి యొక్క అభ్యాసాన్ని పెంచండి**

నలువైపులా అలజడి ఉంది, వ్యక్తుల కారణముగా, ప్రకృతి కారణముగా అలజడి పెరిగేదే ఉంది, అటువంటి సమయములో రక్షణకు సాధనము - ఒక్క సెకండులో స్వయాన్ని విదేహీగా, అశరీరిగా లేక ఆత్మాభిమానిగా తయారుచేసుకోవటము. కనుక మధ్యమధ్యలో ఇలా ట్రయల్ చెయ్యండి - ఒక్క సెకండులో మనసు, బుద్ధిని ఎక్కడ కావాలనుకుంటే అక్కడ స్థితి చేయగలరా! దీనినే సాధన అని అంటారు.